క్లుప్తంగా

నేడు డయల్ యువర్ కమిషనర్

నెహ్రూ నగర్: డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9:30 నుంచి 10:30 గంటల వరకు 0863–2224202 నంబర్ కు ఫోన్ చేయాల్సిందిగా సూచించారు. అనంతరం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కౌన్సిల్ సమావేశ మందిరంలో మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి నేరుగా అర్జీలు, ఫిర్యాదులు తీసుకుంటామని కమిషనర్ ఆ ప్రకటనలో తెలిపారు.

జొమాటో కార్మికుల నిరసన ర్యాలీ

లక్ష్మీపురం: జొమాటో కార్మికులు తమ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని శని, ఆదివారాలు నిర్వహిస్తున్న సమ్మె ఆదివారానికి రెండో రోజుకు చేరింది. సమ్మెలో గుంటూరు నగరంలో పని చేస్తున్న జొమాటో కార్మికులు అందరూ పాల్గొన్నారు. ఆదివారం గుంటూరు అంబేద్కర్ సర్కిల్(లాడ్జి సెంటర్)లో నిరసన తెలిపారు. యూనియన్ కార్యదర్శి ఈ.క్రాంతి రణదేవ్ మాట్లాడారు. కార్యక్రమంలో విజయ్‌కుమార్, వెంకట్, వాల్మీకి, బెస్తాని నాగేశ్వరరావు, దుర్గారావు, రామారావు, షేక్ అబ్దుల్లా, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు నోటు పుస్తకాలు, బ్యాగులు పంపిణీ

గుంటూరు ఎడ్యుకేషన్: ఫ్యాన్సీ, స్టేషనరీ, జనరల్ మర్చంట్స్ అసోసియేషన్ సేవలు అభినందనీయమని తూర్పు ఎమ్మెల్యే ఎండీ నసీర్ అహ్మద్ పేర్కొన్నారు. కొత్తపేటలోని గుంటూరు పట్టణ ఫ్యాన్సీ స్టేషనరీ జనరల్ మర్చంట్స్ అసోసియేషన్ సమావేశ మందిరంలో వెయ్యి మంది పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు, 4000 నోటు పుస్తకాలు, పెన్నులు, స్కూల్ బ్యాగులు ఆదివారం అందజేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు జుజ్జూరు శేష ప్రభాకరరావు మాట్లాడారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు గర్రె శ్రీరాములు, బచ్చు వెంకటసుబ్బయ్య గల్లా రమేష్ కుమార్, ప్రధాన కార్యదర్శి రంగా వెంకట రామకృష్ణ కార్యదర్శులు వేమూరి వెంకట కామేశ్వరరావు, బచ్చు లక్ష్మీనర శ్రీనివాసరావు, పాదర్తి వెంకటేశ్వర్లు, కోశాధికారి అచ్యుత నిరంజన్, కార్యక్రమ నిర్వాహకులు చుండూరు దామోదర్‌రావు పాల్గొన్నారు.

సర్టిఫైడ్ సైకో బాలకృష్ణ



పిచ్చిరెడ్డి

పట్నంబజారు: పిచ్చోడి చేతిలో రాయిని తలపించేలా.. అసెంబ్లీలో బాలకృష్ణ చేతిలో మైకును పెట్టారని వైఎస్సార్ సీపీ బూత్‌కమిటీ జిల్లా అధ్యక్షుడు ఉడుముల పిచ్చిరెడ్డి విమర్శించారు. బృందావన్‌గార్డెన్స్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మద్యం మత్తులో ఎప్పుడూ తూలుతూ ఉండే బాలకృష్ణ నోటికి ఇష్టమొచ్చినట్లు మాట్లాడటం సిగ్గుచేటన్నారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సైకో అని వ్యాఖ్యానించిన బాలకృష్ణ.. సర్టిఫికెట్ ఉన్న సైకో అని ధ్వజమెత్తారు. నోరు అదుపులో పెట్టుకోకపోతే ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

ఎస్పీ ఆకస్మిక తనిఖీలు

పట్నంబజార్: పాత గుంటూరు పోలీసుస్టేషన్‌ను జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని ఆదేశించారు. రాత్రి వేళలో గస్తీ పెట్టాలని, శాంతి భద్రతల పరిరక్షణలో ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఎస్పీ వెంట డీఎస్పీ అబ్దుల్ అజీజ్, పాత గుంటూరు సీఐ వెంకటప్రసాద్ పాల్గొన్నారు.

మీ గుండె చప్పుడు వినండి..

- చిన్న వయస్సులోనే గుండె జబ్బులు
- ఆధునిక జీవన శైలితో పెరుగుతున్న జబ్బులు
- అప్రమత్తంగా లేకపోతే ప్రాణాలు పోయే ప్రమాదం
- నేడు వరల్డ్ హార్ట్ డే

గుంటూరు మెడికల్: ఇటీవల హార్ట్ స్ట్రోక్ భయపెడుతోంది. వయసుతో నిమిత్తం లేకుండా గుండెజబ్బు వేధిస్తోంది. కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా జబ్బు బరిన పడకుండ ఉండొచ్చని వైద్యులు చెబుతున్నారు. ప్రతి ఒక్కరు గుండెజబ్బుల బారిన పడి ప్రాణాలు కోల్పోవటంపై గుండెజబ్బు వైద్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లబ్ డబ్ మంటూ నిమిషానికి 72 సార్లు కొట్టుకునే గుండెకు జబ్బు రాకుండా ముందస్తు జాగ్రతలు ఎలా తీసుకోవాలో తెలియజేస్తూ ప్రతి ఏడాది సెప్టెంబర్ 29న వరల్డ్ హార్ట్‌డేను నిర్వహిస్తున్నారు. స్విట్జర్లాండ్‌లో జెనీవాలోని వరల్డ్ హార్ట్ ఫెడరేషన్ సంస్థ 2000 నుంచి ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. ఈఏడాది డోన్ట్ మిస్ ఏ బీట్ అనే నినాదంతో వరల్డ్ హార్ట్ డే నిర్వహిస్తుంది.



కార్డియాలజీ వైద్య విభాగంలో చికిత్స పొందుతున్న రోగులు(ఫైల్)

నెంబర్ వన్ కిల్లర్...

గుండెజబ్బు నెంబర్ వన్ కిల్లర్. గుండెజబ్బులు రావటానికి పొగాకు వినియోగం ముఖ్యకారణం. బీపీ, షుగర్, అధిక రక్తపోటు, ఊబకాయం, గాలికాలుష్యం, ఉద్యోగ, వ్యాపార, ఇతర కారణాలతో వచ్చే మానసిక ఒత్తిడి, శారీరక వ్యాయామం లేకపోవటం, మద్యం తాగడం, సరిపడా నిద్ర లేకపోవటం, అన్‌హెల్దీడైట్ తీసుకోవటం ప్రధాన కారణాలు. జిల్లాలో 40 గుండె జబ్బు వైద్య నిపుణులు ఉన్నారు. ఒక్కో వైద్యుడి వద్దకు ప్రతిరోజూ 70 నుంచి 100 మంది వైద్యం కోసం వస్తున్నారు.

ప్రతి ఏడాది పెరుగుతున్న రోగులు..

జిల్లా వ్యాప్తంగా అత్యధిక సంఖ్యలో గుండెజబ్బు రోగులు గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. 2021లో ఓపీ విభాగంలో 15,171 మంది, 2022లో 10,984 మంది, 2023లో 14,577 మంది, 2024లో 40,420 మంది, 2025 ఆగస్టు వరకు 36,582 మంది గుండెజబ్బు రోగులు చికిత్స పొందారు.

ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి...

జంక్ ఫుడ్‌లకు దూరంగా ఉండి, సమీకృత ఆహారం తీసుకోవాలి. మద్యపానం, ధూమపానం, పొగాకు ఉత్పత్తులు నమలటం లాంటి చెడు అలవాట్లుకు దూరంగా ఉండాలి. ఆహారంలో పండ్లు తీసుకోవాలి. ప్రతి రోజూ శారీరక వ్యాయామం చేయటం, ఒత్తిడికి దూరంగా ఉండాలి. బీపీ, షుగర్‌లను అదుపులో పెట్టుకోవాలి, ఊబకాయం లేకుండా చూసుకోవాలి. ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు పాటించడం గుండెజబ్బులను దరిచేరనీయకుండా చూసుకోవచ్చు.

జీజీహెచ్‌లో కార్పొరేట్ వైద్యం



జీజీహెచ్ క్యాథ్‌ల్యాబ్‌లో అత్యాధునిక వైద్య పరికరాలతో ఉచితంగా కార్పొరేట్ కార్డియాలజీ వైద్య సేవలు అందిస్తున్నాం. యాంజియోగ్రామ్, యాంజీయోప్లాస్టీ, పేస్‌మేకర్, ఇతర వైద్య పద్ధతుల ద్వారా గుండె ఆపరేషన్లు ఉచితంగా చేస్తున్నాం. 2022లో 1294 మందికి, 2023లో 1379 మందికి, 2024లో 1490 మందికి, 2025 ఆగస్టు వరకు 1193 మందికి గుండె ఆపరేషన్లు చేసి ప్రాణాలు కాపాడాం.

– డాక్టర్ బొర్రా విజయ్‌చైతన్య, జీజీహెచ్ క్యాథ్‌ల్యాబ్ నిర్వాహకులు

రక్తనాళాల జబ్బులను నిర్లక్ష్యం చేయవద్దు



రక్తనాళాల జబ్బులు(వ్యాస్కులర్ డిసీజెస్)ను నిర్లక్ష్యం చేస్తే చాలా ప్రమాదకరం. గుండెకు వెళ్లే రక్తనాళాలు బ్లాక్ అవడం వలన హార్ట్ ఎటాక్, బ్రెయిన్‌కు వెళ్లే రక్తనాళాలు బ్లాక్ అవడం ద్వారా బ్రెయిన్ స్ట్రోక్(పక్షవాతం) వస్తాయి. హార్ట్ ఎటాక్ వచ్చి స్టంట్ వేయించుకున్న వారిలో మందులు కొన్ని రోజులు వాడి ఆపేయడం ద్వారా బ్రెయిన్ స్ట్రోక్ వచ్చే ప్రమాదం ఉంది. ఇటీవల కాలంలో చేతులు, కాళ్లు, మెడ రక్తనాళాల్లో (పెరిఫెరల్) బ్లాకులు ఎక్కువగా వస్తున్నాయి. రక్తనాళాల జబ్బులను అశ్రద్ధ చేయకుండా ముందస్తుగా స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలి.

– డాక్టర్ అనురాగ్ పోలవరపు, ఇంట్రవెన్షనల్ కార్డియాలజిస్ట్, ఎండో వ్యాస్కులర్ సర్జన్, గుంటూరు.

మహా చండీదేవి.. నమోస్తుతే



బృందావన్‌గార్డెన్స్‌శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ ఆవరణలో గాయత్రీదేవిగా అమ్మవారు



విద్యానగర్ మూడో వీధి శ్రీసాయినాథ సన్నిధానంలో మహాచండీదేవిగా..

నగరంపాలెం: నగరంలోని దేవాలయాల్లో దేవీశరన్నవరాత్రులు అత్యంత భక్తిశద్ధలతో నిర్వహిస్తున్నా. ఏడో రోజైన ఆదివారం అమ్మవారు పలు రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఆయా దేవాలయాల వద్ద ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులుతీరారు. సువాసినులతో కుంకుమార్చనలు, సాయంత్రం దంపతుల తో అమ్మవారి సహస్రనామ పూజలు నిర్వహించారు. విశేష హారతి మంత్రపుష్పం అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు.

గుంటూరు ఎడ్యుకేషన్: మల్లికార్జునపేటలోని గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామివారి దేవస్థానంలో ఆదివారం భ్రమరాంబ అమ్మవారు కాళికాదేవిగా అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం అమ్మవారికి ప్రత్యేక హారతులు ఇచ్చారు.



వికాస్‌నగర్ 11వ వీధి షిరిడి సాయి మందిరంలో స్కందమాతగా..



మల్లికార్జునపేట శివాలయంలో శ్రీకాళికాదేవి అలంకారం



అరండల్‌పేట లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో పుష్పశయ్య అలంకారం



సిద్ధార్థనగర్ శ్రీకనకమహాలక్ష్మీ మందిరంలో చండీదేవిగా..

గుర్రం జాషువా చిరస్మరణీయులు



జాషువా విగ్రహం వద్ద నివాళి



బీజేపీ నాయకుల నివాళి

లక్ష్మీపురం: నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా సాహిత్యాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడమే వారికి నిజమైన నివాళి అని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ ట్రస్టీ పాశం రామారావు అన్నారు. గుంటూరు నగరపాలెం వద్ద ఆదివారం గుర్రం జాషువా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం కార్యక్రమాల నిర్వహణ కమిటీ కన్వీనర్ ఎన్. భావన్నారాయణ మాట్లాడారు. కార్యక్రమంలో ఈమని అప్పారావు, కాకుమాను నాగేశ్వరరావు, కె.శ్రీనివాస్, వై.కష్ణకాంత్, ఎస్.కె. సమీర్, యశ్వంత్, శ్రీనివాస్ పాల్గొన్నారు. గుంటూరు పుచ్చలపల్లి సుందరయ్య నగర్‌లో మహాకవి జయంతి ఆదివారం ఆదినికల్సన్ అధ్యక్షతన సీహెచ్ హరిబాబు స్మారక భవనలో ఘనంగా నిర్వహించారు. గోనే లూథర్ పాల్, ఆది నికల్సన్ పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో..

గుంటూరు మెడికల్: నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా జయంతి ఆదివారం బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దర్శనపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక నగరంపాలెంలోని జాషువా విగ్రహానికి బీజేపీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరపతి రావు, సీనియర్ నాయకులు దారా సాంబయ్య, రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాశ్ నారాయణ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రుద్రపోగు సురేష్ మాదిగ, జాతీయ ఎమ్మార్పీఎస్ నాయకులు కూచిపూడి సత్యం మాదిగ పాల్గొన్నారు.

నగరంపాలెం: తెలుగు భాషకు మహాకవి జాషువా తన కవిత్వంతో వన్నె తెచ్చారని మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ అన్నారు. మహాకవి గుర్రం జాషువా జయంతి సందర్భంగా జాషువా కళా పీఠం ఆధ్వర్యంలో ఆదివారం నగరంపాలెంలోని జాషువా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జాషువా కళా పీఠం సభ్యులు గద్దం ఎలీషా, కడియం జేమ్స్, పాలకాయల వెంకట్, దర్శనపు శ్రీనివాస్, జయ ప్రకాశ్, చెరుకూరి తిరుపతి రావు, అత్తోట జోసఫ్, చావలి బాలస్వామి, డాక్టర్ ఎం.సుధ, హార్మోనిస్ట్ సలీం బాబు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

లక్ష్మీపురం: నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా చిరస్మరణీయులని సాహితీ వేత్త ముప్పాళ్ళ వి.ఎస్.ప్రసాదరావు, అవగాహన సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి పేర్కొన్నారు. అరండల్‌పేట అవగాహన సంస్థలో ఆదివారం గుర్రం జాషువా జయంతి నిర్వహించారు. తొలుత చిత్రపటం వద్ద పూల మాలలు వేసి నివాళులర్పించారు. సాహిత్య విశ్లేషకులు వి.వి రావ్, కవయిత్రి పింగళి భాగ్యలక్ష్మి, కవి జమదగ్ని, గాయకులు రాజశేఖర్, అశోక్, కోటేశ్వరరావు ప్రసంగించారు.

నెహ్రూనగర్: నగరంపాలెంలోని జాషువా విగ్రహం వద్ద నివాళులర్పించారు. దళిత, బహుజన సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ ఆవిష్కరణ

పట్నంబజారు: వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా సూచనల మేరకు ఆదివారం పార్టీ తూర్పు నియోజకవర్గ శ్రేణులు వైఎస్సార్ సీపీ డిజిటల్ బుక్‌ను ఆవిష్కరించారు. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఆమె కార్యాలయంలో పార్టీ శ్రేణులు డిజిటల్ బుక్ స్కానర్‌ను ఆవిష్కరించారు. పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి యర్రబాబు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు నందేటి రాజేష్ మాట్లాడారు. గుర్రం జాషువా జయంతిని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నిర్వహించారు. జాషువా చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

భగత్ సింగ్‌కు ఘన నివాళి

లక్ష్మీపురం: ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ గుంటూరు జిల్లా సమితి ఆధ్వర్యంలో గుంటూరు నగరంలోని కొత్తపేట భగత్ సింగ్ విగ్రహం వద్ద సర్దార్ భగత్ సింగ్ జయంతి నిర్వహించారు. ఆదివారం భగత్ సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్ జీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కుట్రపూరితమైనటువంటి న్యూ ఎడ్యుకేషన్ పాలసీ చట్టాన్ని రద్దు చేయాలన్నారు. ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ వలి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు చైతన్య మాట్లాడారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి యశ్వంత్, నగర కార్యదర్శి ప్రణీత్, సందీప్ , మస్తాన్,ఖాసీం వలి, రెహమాన్ అజయ్ పాల్గొన్నారు.

ప్రజారోగ్య కార్మికుల ఆరోగ్యమే ప్రజల ఆరోగ్యం

నెహ్రూనగర్: ప్రజారోగ్య కార్మికుల ఆరోగ్యమే నగర ప్రజల ఆరోగ్యమని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర తెలిపారు. ఆదివారం గుంటూరు ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) సౌజన్యంతో గుంటూరు నగరపాలక సంస్థ ప్రజారోగ్య, ఇంజినీరింగ్ కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు వైద్యశిబిరం నిర్వహించారు. సుమారు 3 వేల మందికి నగర కమిషనర్ పులి శ్రీనివాసులు నేతృత్వంలో సఫాయి మిత్రా సురక్షా షివిర్‌లో భాగంగా వైద్యసేవలు అందించారు. కమిషనర్ మాట్లాడుతూ ఐఎంఏ సహకారంతో ప్రజారోగ్య కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు అత్యాధునిక కార్పొరేట్ వైద్య పరీక్షలు, నిపుణులైన వైద్యుల పరిశీలన, అవసరమైన మందులు ఉచితంగా అందించడం, తదుపరి వైద్య సేవలు అవసరం అనుకుంటే చేయించడమే మెగా హెల్త్ క్యాంప్ లక్ష్యమన్నారు. ఐఎంఏ గుంటూరు ప్రెసిడెంట్ డాక్టర్ వై.సుబ్బారాయుడు మాట్లాడుతూ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచి, ప్రజల ఆరోగ్యం కోసం కష్టపడే ప్రజారోగ్య కార్మికుల ఆరోగ్యం మెరుగుపరచడానికి ఐఎంఏ పూర్తి సహకారం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఐఎంఏ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ అమర లింగేశ్వరరావు, సెక్రెటరీ డాక్టర్ సాయి కృష్ణ, జాయింట్ సెక్రెటరి డాక్టర్ చంద్ర రాధికారాణి, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ డాక్టర్ మోహన్ భాస్కర్, డాక్టర్ ఈ.కృష్ణ మూర్తి, డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు, డాక్టర్ జి.శివరామకృష్ణ, డాక్టర్ బి.అప్పారావు, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు బి.సిహెచ్.శ్రీనివాస్, బి.శ్రీనివాసరావు, ఎస్ఈ (ఇన్‌చార్జి) సుందర్రామిరెడ్డి, ఎంహెచ్ఓ(ఇన్‌చార్జి) రామారావు పాల్గొన్నారు.

ముందస్తు జాగ్రత్తలతో గుండె జబ్బులు కట్టడి



డాక్టర్ పి.వి.రాఘవశర్మ

గుంటూరు మెడికల్: ప్రపంచవ్యాప్తంగా మరణాలకు గుండె జబ్బులే ప్రథమ కారణమని, ముందుగానే నివారణ చర్యలు తీసుకోవడం ద్వారా లక్షలాది ప్రాణాలను రక్షించకోవచ్చని లలితా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ అధినేత, ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ పి.వి. రాఘవ శర్మ అన్నారు. వరల్డ్ హార్ట్ డే సందర్భంగా ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రతి సంవత్సరం ఒక నినాదంతో గుండె జబ్బులపై అవగాహన కల్పించేందుకు హార్ట్ డే చేస్తారని చెప్పారు. ఈ ఏడాది ప్రతి గుండె చప్పుడు విలువైనదే అనే నినాదంతో గుండె జబ్బులపై అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. గుండె సంబంధిత వ్యాధుల వల్ల కార్డియో వ్యాస్కులర్ డిసీజెస్(సీవీడీ) వలే అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని, గత దశాబ్దంలోనే సీవీడీ మరణాలు దాదాపు రెండింతలయినట్టు చెప్పారు. ప్రతి రోజూ వ్యాయామం చేయాలని, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలన్నారు. ఛాతి నొప్పి, ఆయాసం, గుండె వేగంగా కొట్టుకోవడం వంటి హెచ్చరిక సంకేతాలను గుర్తించి వెంటనే గుండె వైద్యుల వైద్య సహాయం పొందాలని డాక్టర్ రాఘవశర్మ సూచించారు.

హార్ట్ ఎటాక్‌లో ప్రాణరక్షణ కోసం ప్రైమరీ పీసీఐ



పీసీఐ గురించి వివరిస్తున్న కార్డియాలజిస్టులు

గుంటూరు మెడికల్: వరల్డ్ హార్ట్ డే సందర్భంగా ఆదివారం స్థానిన గుజ్జనగుండ్ల సెంటర్‌ని శ్రేష్ఠ హాస్పిటల్స్‌లో హార్ట్ ఎటాక్ వచ్చిన రోగుల ప్రాణాలను కాపాడటంలో ప్రైమరీ పీసీఐ(స్టెంట్ విధానం) ఎంత ముఖ్యమనే విషయాలపై అవగాహన కల్పించారు. ఛాతి నొప్పి అనేది గుండె సంబంధిత సమస్యలు, గ్యాస్ సమస్యలు, కండరాల నొప్పి వల్ల రావచ్చని కార్డియాలజిస్ట్ డాక్టర్ నాగార్జున గొట్టిపాటి తెలిపారు. హార్ట్ ఎటాక్‌గా నిర్ధారణ అయిన రోగులకు వెంటనే ప్రైమరీ పీసీఐ చేసి "గోల్డెన్ అవర్"లో చికిత్స అందిచటం ద్వారా ప్రాణాలను కాపాడటమే గాకుండా భవిష్యత్తులో వచ్చే సమస్యలను కూడా తగ్గిస్తుదన్నారు. డాక్టర్ హేమ సుందర్ కొరప్రాటి మాట్లాడుతూ టైమ్ ఈజ్ మజిల్ అని, చికిత్స ఎంత త్వరగా చేస్తే, అంత త్వరగా ప్రాణాలు కాపాడగలమన్నారు.

గుండె జబ్బులపై అప్రమత్తంగా ఉండాలి

లక్ష్మీపురం: గుండె జబ్బులపై అప్రమత్తంగా ఉండాలని ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ వివేక వీరం రెడ్డి అన్నారు. గుంటూరు అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం వరల్డ్ హార్ట్ డే సందర్భంగా ఆరోగ్య సభ నిర్వహించారు. అనంతరం అవగాహన సభ్యులు డాక్టర్ వివేక్ వీరంరెడ్డిని ఘనంగా సత్కరించారు. సభకు కోఆర్డినేటర్‌గా టీవీ సాయిరాం వ్యవహరించగా, సభలో ప్రొఫెసర్ టీ రత్నారావు, రాడికల్ హ్యూమనిస్ట్ నాయకుడు కె.చంద్రశేఖర రావు, ఆస్టర్ రమేష్ హాస్పిటల్ ప్రతినిధి పి.నరేష్ పాల్గొని ప్రసంగించారు.

సాయి డిగ్రీ కళాశాలపై చర్య తీసుకోవాలి

పట్నంబజారు: వినుకొండలోని సాయి డిగ్రీ కళాశాల నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో ముస్లిం సమాజపు సంప్రదాయాలను అవమానపరిచేలా, అసభ్యత కలిగిన అంశాలను చేర్చడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి షేక్ గులాంరసూల్ తెలిపారు. తూర్పు నియోజవకర్గంలోని ఆయన కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు.